
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సంగారెడ్డి మెదక్ జిల్లాల వార్తలు

5

ఆదివారం 8 జూన్ 2025

'పీఎంశ్రీ' పాఠశాలలకు ప్రత్యేక నిధులు

సంగారెడ్డి అర్బన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి) : పీఎంశ్రీ(ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా)పాఠశాలలకు 2025-26 విద్యాసంవత్సరానికి దినపత్రికలు, మాసపత్రికలు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. సంగారెడ్డి జిల్లాలో 44 పాఠశాలలకు రూ.10 వేల చొప్పున రూ.4.40 లక్షల నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. విద్యార్థులకు సమకాలీన అంశాలపై పట్టురావటానికి, సామాజిక స్పృహ కలగ డానికి పత్రికా పఠనం దోహదం చేయనుంది.



భక్తిశ్రద్ధలతో బక్రీద్ ప్రార్థనలు

సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ముస్లింలు బక్రీద్‌ను శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. రామచంద్రాపురం, పటాన్‌చెరు, సదాశివపేట, కోహీర్, జహీరాబాద్, అందోల్, నారాయణఖేడ్, పుల్కల్, సంగారెడ్డి తదితర మండలాల్లో ఉదయాన్నే ఈద్గాల వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సంగారెడ్డి సమీపంలోని హాస్టల్‌గడ్డ వద్ద గల ఈద్గా వద్ద పెద్దసంఖ్యలో ముస్లింలు ప్రార్థనలకు హాజరయ్యారు.

-సంగారెడ్డి రూరల్

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు

టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): సదాశివపేట మండలం పెద్దాపూర్ గ్రామంలో శనివారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి తెలంగాణ పరిశ్రమల మౌళిక సదుపాయాల (టీజీఐఐసీ) చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నారని పేర్కొన్నారు. పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, హౌసింగ్ ఏఈ మాధవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు చింటూగౌడ్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



సదాశివపేట మండలం పెద్దాపూర్‌లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి



బాలుడి ఆలోచన అదుర్స్ 7

పాత సామగ్రితో సైకిల్‌ను మోపెడ్‌గా మార్చిన విద్యార్థి

తక్కువ ఖర్చుతో శ్రమ లేకుండా ప్రయాణం

మద్యం మత్తులో తండ్రిని చంపిన తనయుడు 7

వేర్వేరు ప్రమాదాల్లో ఎనిమిది మంది మృతి 6

సాగుకు సన్నద్ధం

దుక్కులు దున్ని చేలు చదును

రోహిణీ కార్తెలోనే వానలు

వ్యవసాయ పనులు ప్రారంభించిన రైతులు

సంగారెడ్డి జిల్లాలో 8.04 లక్షల ఎకరాల్లో పంటల అంచనా

అత్యధికంగా 3,87,539 ఎకరాల్లో పత్తి

1,65,173 ఎకరాల్లో వరి నాట్లు

అందుబాటులో విత్తనాలు, ఎరువులు

సంగారెడ్డి టౌన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పంటల సాగుకు రైతన్నలు సన్నద్ధమవుతున్నారు. ఈసారి రోహిణీ కార్తెలోనే వానలు కురియడంతో దుక్కులు దున్ని చేలను చదును చేసి విత్తనం వేసేందుకు సిద్ధం చేస్తున్నారు. వారం క్రితమే వర్షాలు రావడంతో సీజన్ మొదలైందని అన్నదాతలు హర్షం వ్యక్తంచేస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలో గతేడాది కంటే ఈసారి వానాకాలం సీజన్‌లో సాగు విస్తీర్ణం పెరగవచ్చని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందుకు తగినట్లు విత్తనాలు, ఎరువులు సిద్ధం చేస్తున్నారు.

గతేడాది కంటే ఎక్కువ పంటలు

గత సంవత్సరం వానాకాలంలో సంగారెడ్డి జిల్లాలో 7,33,047 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. ఈసారి ఖరీఫ్ సీజన్‌లో 8.04 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు వేస్తారని వ్యవసాయశాఖ అధికారులు అంచనాలు రూపొందించారు. ఇందులో అత్యధికంగా పత్తి 3,87,539 ఎకరాలు, వరి 1,65,173 ఎకరాల్లో సాగు చేస్తారని అంచనా వేశారు. అలాగే, కందులు 84,821 ఎకరాలు, సోయాబీన్ 79,163 ఎకరాలు, మొక్కజొన్న 7,983 ఎకరాలు, మినుములు 14,826 ఎకరాలు, పెసర 9,787 ఎకరాలు, ఇతర పంటలు 26,256 ఎకరాల్లో సాగు చేయనున్నారు. ఉద్యానవన పంటలు 28,964 ఎకరాల్లో పండించవచ్చని అంచనాలు సిద్ధం చేశారు.

సరిపడా విత్తనాలు, ఎరువులు

జిల్లాలో వానాకాలం సీజన్‌లో సాగు చేయడానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉన్నాయని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. జిల్లాలో పత్తి విత్తనాలు 7,75,078 ప్యాకెట్లు, వరి 41,293 క్వింటాళ్లు, మొక్కజొన్న 639 క్వింటాళ్లు, సోయాబీన్ 23,749 క్వింటాళ్లు, మినుములు 391 క్వింటాళ్లు

మిగతా 8వ పేజీలో



విత్తనాలు (క్వింటాళ్లలో)

వరి	41,293
మొక్కజొన్న	639
సోయాబీన్	23,749
మినుములు	391
పెసర	593
కందులు	3,393
జొన్నలు	33
పత్తి	7,75,078 ప్యాకెట్లు

ఎరువులు (మెట్రిక్ టన్నుల్లో)

యూరియా	41,900
డీఏపీ	14,045
ఎంవోపీ	19,682
ఎస్ఎస్‌పీ	9,225

ముగిసిన ఇంటర్ సప్లిమెంటరీ మూల్యాంకనం

సంగారెడ్డి అర్బన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకన ప్రక్రియ శనివారంతో ముగిసింది. గత నెల 22వ తేదీ నుంచి 28 వరకు ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు జరిగిన విషయం తెలిసిందే. సంగారెడ్డిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గత నెల 28న ఇంటర్ మూల్యాంకనం నిర్వహించారు. జిల్లాలో వివిధ సబ్జెక్టుల్లో విద్యార్థులు రాసిన 36వేల జవాబు పత్రాలను మూల్యాంకనం చేసినట్టు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవిందరామ్ తెలిపారు.

నర్సాపూర్ ఆసుపత్రిలో కాయకల్ప బృందం తనిఖీలు



నర్సాపూర్‌లో కాయకల్ప బృందం సభ్యులతో వైద్యులు, సిబ్బంది

నర్సాపూర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, సదుపాయలను శనివారం కాయకల్ప బృందం తనిఖీ చేసింది. డాక్టర్ హరిప్రియ, డాక్టర్ శ్రావణ్, డాక్టర్ రాధికలతో కూడిన బృందం ఆసుపత్రిని సందర్శించి వైద్యులు, సిబ్బందితో మాట్లాడి వైద్య సేవల వివరాలు తెలుసుకున్నారు. ఆసుపత్రి ప్రాంగణంలో పచ్చదనం, పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. అందుబాటులో ఉన్న సౌకర్యాలను తనిఖీ చేశారు.

జాబ్‌కార్డు ఉన్నవారందరికీ 'ఆత్మీయ భరోసా'

ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి : మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

చిన్నశంకరంపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ జాబ్‌కార్డు ఉన్నవారందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందజేస్తామని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. చిన్న శంకరంపేట మండలంలోని మడూరులో ఉపాధిహామీ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధిహామీ పనులను పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. జాబ్‌కార్డు ఉన్నవారందరికీ పని కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఉపాధిహామీలో భాగంగా చెరువులు, కుంటల్లో పూడికతీత పనులు చేపట్టాలని ఆదేశించారు. కూలి డబ్బులు సకాలంలో అందుతున్నాయా అని కూలీలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి కూలీలకు వర్తిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతోపాటు అన్నిసౌకర్యాలు అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో దామోదర్, ఏపీవో రాజకుమార్, పశు వైద్యాధికారి గీతా మాలిక, పంచాయతీ కార్యదర్శి ప్రతిభ, ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు

ప్రభుత్వ ఆస్పత్రి తనిఖీ

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్నికలెక్టర్ రాహుల్‌రాజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివిధ విభాగాలను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. రోగులతో మాట్లాడి ఆస్పత్రిలో అందుతున్న వైద్యసేవలపై ఆరాతీశారు. అనంతరం ఆసుపత్రి రికార్డులను పరిశీలించారు.



దౌల్తాబాద్‌లో పాఠశాలలో తలుపులు పగులగొట్టి పుస్తకాలు చిందరవందరగా పడేసిన ఆకతాయిలు

తలుపులు పగులగొట్టి.. పాఠశాలలోకి చొరబడి..

దౌల్తాబాద్‌లో ఆకతాయిల ఆగడాలు

పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం

హత్నూర, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): హత్నూర మండలం దౌల్తాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అసాంఘికశక్తులకు అడ్డాగా మారింది. తలుపులు పగలగొట్టి గదుల్లోకి చొరబడుతున్న ఆకతాయిలు ఫర్నిచర్ విరగ్గొట్టి, బీరువాలను పగులగొట్టి, పుస్తకాలు, సామగ్రిని చిందరవందర చేస్తున్నారు. పాఠశాల ఆవరణలోనే మద్యం, మత్తుపదార్థాలు సేవిస్తున్నారు. పలుమార్లు పోలీసులకు సమాచారమిచ్చినా చర్యలు తీసుకోలేదని స్థానికులు వాపోతున్నారు.

స్కాన్ చెయ్.. టికెట్ తీసుకో..

ఆర్టీసీలో డిజిటల్ చెల్లింపులు

ఈ-టిమ్స్ మిషన్స్‌తో టికెట్ల జారీ

స్కానర్ ద్వారా యూపీఐ పేమెంట్స్

సంగారెడ్డి డిపోకు 80 ఈ-టిమ్స్ యంత్రాలు



సంగారెడ్డి అర్బన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికుల సౌకర్యార్థం టీజీఎస్ ఆర్టీసీ సాంకేతికత వైపు అడుగులు వేస్తున్నది. టికెట్ల జారీలో డిజిటల్ లావాదేవీలను ప్రవేశపెట్టడం ద్వారా చిల్లర సమస్యకు పరిష్కారం చూపడంతో పాటు సమయం ఆదా చేయడానికి చర్యలు ప్రారంభించింది.

చిల్లర పంచాయితీ

ఆర్టీసీ బస్సు ఎక్కి టికెట్ తీసుకుందామంటే చిల్లర సమస్యతో చికాకులు తప్పడం లేదు. జేబులో డబ్బులు ఉన్నా చిల్లర లేకపోవడంతో కండక్టర్లకు ప్రయాణికులకు మధ్య పంచాయితీ నెలకొంటుంది. ప్రయాణికులు రూ.100, రూ.500 నోట్లు ఇస్తుండటంతో చిల్లర లేక కండక్టర్లు టికెట్ ఇచ్చి, చిల్లర బస్సు దిగేటప్పుడు తీసుకోవాలని టికెట్ వెనక రాసిస్తుంటారు. స్టేజీ వచ్చినప్పుడు ఇద్దరు, ముగ్గురు ప్రయాణికులకు కలిపి చిల్లర ఇస్తుంటారు. దీంతో బస్సు దిగిన తరువాత కూడా పంపకాల సమస్య మిగిలిపోతున్నది. చిల్లర సమస్యతో ప్రయాణికులు, కండక్టర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలకు చెక్ పెట్టేందుకు ఆర్టీసీ డిజిటల్ చెల్లింపులను అమల్లోకి తీసుకొచ్చింది.



నగదు రహిత చెల్లింపులు

మరోవైపు గుడి నుంచి బడి వరకు.. రూపాయి నుంచి రూ.లక్షల వరకు డిజిటల్ చెల్లింపులు నిత్యకృత్యమయ్యాయి. ఈక్రమంలో ఆర్టీసీ కూడా డిజిటల్ చెల్లింపుల విధానంపై కసరత్తు చేపట్టింది. దూర ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో ప్రయోగాత్మకంగా డిజిటల్ చెల్లింపులు అమల్లోకి తీసుకురాగా ఇది విజయవంతమైంది. దీంతో, సంగారెడ్డి జిల్లాలోని అన్ని రూట్లలో ఈవిధానం అమలుకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా సంగారెడ్డి ఆర్టీసీ డిపోకు 80 ఈ-టిమ్ మిషన్లు పంపిణీ చేయగా పలు సర్వీసుల్లో వినియోగిస్తున్నారు. ప్రయాణికులకు డిజిటల్ సౌకర్యం కల్పించడమే కాకుండా నగదు రహిత చెల్లింపులు సురక్షితంగా జరిగేలా చూడాలన్నదే సంస్థ ఉద్దేశమని ఆర్టీసీ అధికారులు పేర్కొంటున్నారు. మరో వారంలో సంగారెడ్డి డిపో పరిధిలోని అన్ని బస్సుల్లో ఈ-టిమ్ మిషన్లు అందుబాటులోకి తీసుకువచ్చి డిజిటల్ లావాదేవీలను అమల్లోకి తెస్తామని సంగారెడ్డి డిపో మేనేజర్ ఉపేందర్ తెలిపారు.

సండే స్పెషల్

Sunday Special

జమిడిక మోత.. పంబాల, బైండ్ల ఆట

ఎల్లమ్మ, పోచమ్మ బోనాలు చేస్తున్నామంటే పంబాల, బైండ్ల కళాకారులు ఉండాల్సిందే. జమిడిక, సుతి, పంబా వాయిద్యాలతో లయబద్ధంగా నృత్యాలు చేస్తూ భక్తి పూర్వకంతో వారు అమ్మవార్లను కొలుస్తారు. ఎల్లమ్మ, పోచమ్మ, మైసమ్మ, పెద్దమ్మ, సారుగమ్మ, భూలక్ష్మి, మహాలక్ష్మి, బొడ్రాయి వంటి పూజా కార్యక్రమాల్లో ఈ పంబాల, బైండ్ల కళాకారులదే ప్రధాన భూమిక. ఎల్లమ్మ ఆలయాల్లో పట్నాలు వేయడం, పోతరాజుల వేషాలు, గ్రామ దేవతల ప్రాశస్త్యాన్ని కథల ద్వారా వివరించడం వంటి వంశ పారంపర్యంగా వస్తున్న సంస్కృతీ సంప్రదాయాలను చెక్కుచెదరకుండా కొనసాగిస్తున్న కళాకారులు వారు.

విభిన్న కళారూపం.. చెదరని సంస్కృతీ పయనం

గ్రామ దేవతల సంప్రదాయ పూజారులు

జమిడిక, సుతి, పంబజోడు వీరి వాయిద్యాలు

హుస్నాబాద్ రేణుకా ఎల్లమ్మ జాతరలో ప్రత్యేకత చాటుతున్న కళాకారులు

7



హుస్నాబాద్ ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో కథ చెబుతున్న పంబాల, బైండ్ల కళాకారులు



పట్నాలు వేస్తున్న బైండ్ల వారు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఎనిమిది మంది మృతి

కారు ఢీకొని బాలిక..


అర్చన(ఫైల్)

నర్సాపూర్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని బాలిక మృతిచెందిన సంఘటన నర్సాపూర్-తూప్రాన్ ప్రధాన రోడ్డుపై హన్మంతాపూర్ సమీపంలో చోటు చేసుకున్నది. కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం అర్జున్, లలితల కూతురు అర్చన(8) కుటుంబ సభ్యులతో కలిసి హన్మంతాపూర్ నుంచి నర్సాపూర్‌కు సాయంత్రం నడచుకుంటూ వస్తున్నది. ఈ క్రమంలో శివ్వంపేట మండలం పెద్దగొట్టిముక్లకు చెందిన కారు వేగంగా వచ్చి బాలికను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలైంది. ఆమెను వెంటనే నర్సాపూర్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. బాలిక కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ..

నర్సాపూర్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 3న నర్సాపూర్‌కు చెందిన విభూషన్‌రెడ్డి(44) సంగారెడ్డికి వెళ్లి తిరిగి నర్సాపూర్ వస్తున్న క్రమంలో నర్సాపూర్-సంగారెడ్డి ప్రధాన రోడ్డుపై ఎల్లమ్మ గుడి వద్ద వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన అతడిని గాంధీకి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కారు, బైక్ ఢీ కొని..


శివగౌడ్(ఫైల్)

పెద్దశంకరంపేట, జూన్ 7(ఆంధ్రజ్యోతి): కారు , బైక్ ఎదురెదురుగా ఢీ కొనడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన పెద్దశంకరంపేట మండల పరిధిలోని ఉత్తులూరు శివారులో చోటుచేసుకుంది. పేట ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. టేక్మాల్ మండలం వెల్పుగొండ గ్రామానికి చెందిన కోటగిరి శివగౌడ్(49) పెద్దశంకరంపేట నుంచి సొంత గ్రామమైన వెల్పుగొండకు బైక్ పై వెళ్తున్నాడు. అదే సమయంలో ఉత్తులూరు నుంచి ఎదురుగా వస్తున్న కారు ఢీ కొట్టడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే సంగారెడ్డి ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుమారుడు సాకేత్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేట ఎస్‌ఐ తెలిపారు.

ట్రాక్టర్ ఢీ కొని రైతు..


బాలయ్య

నారాయణఖేడ్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ ఢీ కొనడంతో రైతు మృతి చెందాడు. ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి శనివారం తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని ర్యాకల్‌కు చెందిన బాలయ్య(50) ట్రాక్టర్‌ను అద్దెకు తీసుకుని అదే గ్రామానికి చెందిన డ్రైవర్ బాగయ్య తన పొలం దున్నడానికి దున్నిస్తున్నాడు. ఈ క్రమంలో బాలయ్యను ట్రాక్టర్ ఢీ కొనడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. బాలయ్యకు భార్య, కూతురు , కుమారుడు ఉన్నారు. .

కారు ఢీకొని లారీ డ్రైవర్..

కొండపాక, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): నడుచుకుంటూ రోడ్డు దాటుతున్న లారీ డ్రైవర్ కారు ఢీకొని మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే కొండపాక మండలం గిరాయిపల్లి గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ ముడికే మల్లేశం (54) కొన్ని సంవత్సరాలుగా సిద్దిపేటలో నివాసముంటూ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సిద్దిపేటకు చెందిన లారీపై హైదరాబాద్‌కు వెళ్తా మార్గమధ్యంలో తిమ్మారెడ్డిపల్లి వద్ద నిలిపి రోడ్డుకు అవతలి వైపు ఉన్న హోటల్‌కు టీ తాగేందుకు నడుచుకుంటూ వెళ్లాడు. తిరిగి లారీ వద్దకు వస్తున్న క్రమంలో సిద్దిపేట వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు అతడిని ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని కుకునూరుపల్లి ఎస్‌ఐ శ్రీనివాస్ పరిశీలించారు.

వాహనం ఢీకొని

అల్లాదుర్గం,జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం మహారాష్ట్రకు చెందిన మహేష్, మరో ఇద్దరు యువకులతో కలసి జోగిపేట వైపు నుంచి నాందెడ్‌కు ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని చిల్వర్ గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై ఒక్క సారిగా గుర్తుతెలియని వాహనం వెనక్కి తీసుకుంటున్న సమయంలో వీరి బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో మహేష్ అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి గాయలయ్యాయి.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..


రామ్మోహన్‌రెడ్డి (ఫైల్

రాయపోల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. ఎస్‌ఐ రఘుపతి కథనం ప్రకారం.. గజ్వేల్ మండలం ధర్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కర్కల రామ్మోహన్‌రెడ్డి(44) శుక్రవారం రాత్రి 8:30 గంటల సమయంలో బైకు తీసుకొని పనిపై బయటికెళ్లాడు. రాయపోల్ మండలం అంకిరెడ్డిపల్లి వద్ద ఆయన బైకును గుర్తు తెలియని వాహనం ఢీకొట్టంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. రామ్మోహన్‌రెడ్డి భార్య కర్కల మంజుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా పడి రైతు..


బాపురెడ్డి(ఫైల్

కొండపాక, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ బోల్తాపడి రైతు మృతిచెందిన సంఘటన కొండపాక మండల పరిధిలో శనివారం చోటుచేసుకున్నది. గ్రామస్థుల వివరాల ప్రకారం.. మండలంలోని సిరిసినగండ్ల గ్రామానికి చెందిన దేవిరెడ్డి బాపురెడ్డి(45) తన పొలంలో భూమి చదును చేయడానికి ట్రాక్టర్‌ను తానే నడుపుతూ వెళ్లాడు. ఈ క్రమంలో ట్రాక్టర్ అదుపుతప్పి నీళ్లు లేని కాలువలో బోల్తా పడడగా, చక్రాల కింద పడి బాపురెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. ఫిబ్రవరి నెలలో బాపురెడ్డి కుమారుడు ఉదయ్‌కిరణ్ రెడ్డి గ్రామ శివారులో రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందగా, తాజాగా ఆయన ప్రమాదవశాత్తు మృతిచెందడంతో కుంటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

బైక్ చెట్టును ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

రాయపోల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం అదుపుతప్పి చెట్టుకు ఢీకొనగా ఒకరు తీవ్రంగా గాయపడిన సంఘటన రాయపోల్ ఉన్నత పాఠశాల వద్ద శనివారం చోటు చేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం.. హైదరాబాద్ బాలాజీనగర్‌కు చెందిన కోదాటి కిషోర్(28) వాడితే, వాసూనాయక్(35) వేములవాడ దేవస్థానానికి వెళ్లి శనివారం తిరుగు ప్రయాణం అయ్యారు. ఈ క్రమంలో రాయపోల్ ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న మూలమలుపు వద్ద వారు ప్రయాణిస్తున్న బైక్ అదుపుతప్పి చెట్టును బలంగా ఢీకొట్టింది. దీంతో బైక్ నడుపుతున్న కిషోర్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను వెంటనే 108 అంబులెన్స్‌లో గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు అంబులెన్స్ సిబ్బంది భాను, నర్సింహులు తెలిపారు.

రెండు కార్లు ఢీకొని పలువురికి..

అల్లాదుర్గం, జూన్.7 (ఆంధ్రజ్యోతి) :అల్లాదుర్గం మండలం చిల్వర్ గ్రామ సమీపంలోని 161వ జాతీయ రహదారి పై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలైనట్లు గ్రామస్థులు తెలిపారు. హైదరాబాద్ నుంచి నారాయణఖేడ్ వైపు వెళ్తున్న రెండు కార్లు మండలంలోని చిల్వర్ గ్రామ సమీపంలో వెనకవైను చుంచివస్తున్న కారు ముందు వెళ్తున్న కారును ఢీ కొట్టిందన్నారు. ఈ ప్రమాదంలో కారులో ప్రయానిస్తున్న వారికి గాయాలు కావడంతో వారిని ఆసుపత్రికి తరలించినట్లు గ్రామస్థులు తెలిపారు.

కుంటలో పడి యువకుడి మృతి


శేఖర్(ఫైల్)

చిలప్‌చెడ్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కుంటలో పడి యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బండపోతుగల్ గ్రామానికి చెందిన శేఖర్(24) ఫైజాబాద్ గ్రామానికి చెందిన టేకుల నర్సింహారెడ్డి వద్ద బర్రెల కాపరిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం బర్రెలు మేపడానికని వెళ్లి తిరిగి రాలేదు. ఈ విషయాన్ని యజమాని టేకుల నరసింహారెడ్డి శేఖర్ తల్లిదండ్రులకు తెలియజేయగా శనివారం ఉదయం వడ్లవానికుంట వైపు వెతకగా శేఖర్ మృతదేహం నీటిలో తేలి కనిపించింది. పశువులను కడగడానికి కుంటలోకి దిగి ఉంటాడని, ఈత రాకపోవడంతో మృతిచెంది ఉంటాడని మృతుడి తండ్రి దార హనుమంతు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ..


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కోహీర్, జూన్ 7:(ఆంధ్రజ్యోతి) గూడ్స్ రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కోహీర్ మండలంలోని రాజనెల్లి గ్రామ శివారులోని రైల్వే ట్రక్‌పై శనివారం ఉదయం చోటు చేసుకుంది. వికారాబాద్ రైల్వే పోలీసుల కథనం ప్రకారం గూడ్స్ రైలు కింద పడి మృతి చెందిన వ్యక్తి వయస్సు 35 నుంచి 40 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. ఒంటిపైన తెలుపు రంగు ఫుల్‌షర్ట్, కాఫీ కలర్ ఫ్యాంట్ నలుపు రంగు మొలతాడు ధరించి ఉన్నాడని తెలిపారు. అతడి మృతదేహాన్ని వికారాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. మృతునికి సంభందించి సమాచారం, ఆచూకీ తెలిసిన వారు వికారాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని, లేదా 7702629707 నంబర్‌ను సంప్రదించవచ్చని రైల్వే పోలీసులు తెలిపారు.

భూతగాదాలతో వ్యక్తి ఆత్మహత్య

చేగుంట ,జూన్ 7 (ఆంధ్రజ్యోతి): భూమి విషయంలో జరుగుతున్న తగాదాకు మనస్తాపం చెంది ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని పులిమామిడి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది .చేగుంట ఎస్‌ఐ చైతన్యకుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం: పులిమామిడి గ్రామానికి చెందిన కొమ్ము స్వామి(34) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు గ్రామంలో సర్వేనెంబర్ 309 /ర 108 నందు అతడికి ఎకరా 20 గుంటల భూమి ఉన్నది. ఆ భూమి విషయంలో పులిమామిడి గ్రామానికి చెందిన ఎమ్మాజి బాలమణితో గత కొంతకాలంగా భూతగాద జరుగుతున్నది. ఈ విషయంలో కొమ్ము స్వామి మనస్తాపం చెంది తన వ్యవసాయం పొలంలో వైరుతో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి భార్య రేణుక ఇద్దరు కుమారులు ఉన్నారు. తల్లి నరసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. శవాన్ని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

సండే స్పెషల్ Sunday Special

జమిడిక మోత.. పంబాల, బైండ్ల ఆట

- విభిన్న కళారూపం.. చెదరని సంస్కృతీ పయనం
- గ్రామ దేవతల సంప్రదాయ పూజారులు
- జమిడిక, సుతి, పంబజోడు వీరి వాయిద్యాలు
- హుస్నాబాద్ రేణుకా ఎల్లమ్మ జాతరలో ప్రత్యేకత చాటుతున్న కళాకారులు

హుస్నాబాద్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ఏళ్ల కాలంగా వస్తున్న తెలంగాణ సంస్కృతికి అద్దం పడుతున్నారు పంబాల, బైండ్ల పూజారులు. గ్రామ దేవతల వద్ద తమ కళారూపంతో పూజలు చేస్తూ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. భక్తి భావంతో గ్రామ దేవతలను కొలుస్తూనే వారి ఆటాపాటలుంటాయి. అమ్మవార్లను కొలుస్తూ వీరు ప్రదర్శించే ఆటాపాటలకు శివసత్తులు శిగలూగుతారు. భక్తులు చిందేస్తారు. తెలంగాణ ఉద్యమంలో సబ్బండ కులాలను ఐక్యం చేసిన బోనాల సంస్కృతిలోనూ పంబాల, బైండ్ల కళాకారులదే ప్రధాన భూమిక ఉంటుంది. వీరి వాయిద్యాలు కూడా విభిన్నంగా ఉంటాయి. జమిడిక, సుతి, పంబా వాయిద్యాలను వాయిస్తూ, లయబద్ధంగా కథ చెబుతూ, అందుకు తగ్గట్టుగా అభినయిస్తూ అమ్మవార్లను కొలుస్తారు.


జమిడిక, సుతితో కళాకారులు(ఫైల్)

పంబాల, బైండ్ల కళాకారుల చరిత్ర

పురాణాల ప్రకారం ఎల్లమ్మ దేవికి ముగ్గురు కుమారులుంటారు. ఎల్లమ్మ భర్తయిన జమదగ్ని తన కుమారుడైన పరశురాముడిని తల్లి ఎల్లమ్మ శిరస్సును ఖండించమని ఆజ్ఞాపిస్తాడు. నా కుమారుడు ఎలాగైన చంపుతాడని పరుగెత్తి హరిజన వాడలోని లందగోళంలో దాగి ఉంటుంది. పరశురాముడు ఆమె బయటకు రావాలని కంచు జమిడిక తయారు చేసి మోగిస్తాడు. ఎల్లమ్మ దేవికి జమిడిక సప్పుడంటే చాలా ఇష్టం. ఆ వాయిద్య సప్పుడు వినగానే ఎల్లమ్మ తల్లి బయటకు రావడంతో పరశురాముడు తల్లి తలను ఖండిస్తాడు. అప్పుడే రానున్న కలియుగంలో పంబాల, బైండ్ల వారు పుట్టనున్నారని, జమిడిక ఆధారంగా చేసుకొని ఎల్లమ్మ కొలుపు చేసుకుంటూ జీవిస్తారని చెప్పినట్లు చరిత్ర ఉందని పంబాల, బైండ్ల కళాకారులు తెలిపారు. అప్పటి నుంచి ఇదే అచారం కొనసాగుతుందని తెలిపారు. వైశాఖ, శ్రావణం, ఆషాడమాసాల్లో ప్రతీ గ్రామంలో పోచమ్మ, ఎల్లమ్మ బోనాలు చేసుకుంటారు. ఈ పూజలను నిర్వహిస్తూ భక్తులు ఇచ్చే డబ్బుతో జీవనం సాగిస్తూ వారు ఆచారాన్ని కొనసాగిస్తున్నారు.

హుస్నాబాద్‌లో 50పైగా కుటుంబాలు

హుస్నాబాద్ ప్రాంతంలో పంబాల, బైండ్ల కళాకారులు దాదాపు 50 కుటుంబాలకుపైగా ఉంటాయి. వీరు గ్రామాలను పంచుకుని ఆ గ్రామాల్లో జరిగే గ్రామ దేవతల కార్యక్రమాల్లో పూజలు చేస్తారు. గత 27 రోజులుగా జరుగుతున్న హుస్నాబాద్ రేణుకా ఎల్లమ్మ జాతరలో భక్తులకు అమ్మవారి ప్రాశస్త్యాన్ని వివరిస్తూ తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారు.

ఆచారాన్ని కొనసాగిస్తున్నాం

తాతల కాలం నాటి నుంచి వస్తున్న ఆచారాన్ని కొనసాగిస్తున్నాం. ఎల్లమ్మ, పోచమ్మ, మైసమ్మ, పెద్దమ్మ, మహలక్ష్మి, భూలక్ష్మి, బొడ్రాయి వంటి గ్రామ దేవతలను కొలవడం ఆనవాయితీగా వస్తుంది. భక్తులు మమ్మల్ని ఆదరిస్తుండటంతో ఈ సంస్కృతిని రక్షించుకుంటున్నాం.

- వేముగంటి శ్రీనివాస్, బైండ్ల కళాకారుడు


ఎల్లమ్మ పట్నాలు వేస్తున్న బైండ్ల కళాకారుడు


బసవ ప్రార్థన పుస్తక రూపంలో ముద్రించిన పెళ్లి పత్రిక

బసవ ప్రార్థన పుస్తకంలో పెళ్లి పత్రిక

నారాయణఖేడ్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): వివాహ ఆహ్వాన పత్రికలను పోటీలు పడి అచ్చు వేయిస్తున్న ప్రస్తుత తరుణంలో సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పట్టణానికి చెందిన నీలకంఠం శంకరప్ప, సుగుణ దంపతులు తమ కుమారుడు సూర్యకిరణ్ వివాహ పత్రికను వినూత్నంగా ముద్రింపజేశారు. పలువురిలో సంస్కారం, బసవతత్వాన్ని పెంపొందింప చేసే విధంగా బసవ ప్రార్థనపుస్తకంలోనే వివాహ పత్రికను అచ్చు వేయించి ప్రశంసలు పొందుతున్నారు. బసవేశ్వరుడు చూపిన మార్గదర్శకాలను తెలుపుతూ పెళ్లి పత్రికను రూపొందించారు. లింగాయత్ ధర్మ షట్ సూత్రాలను ముద్రింప చేశారు. వారి వివాహం నేడు నారాయణఖేడ్‌లోని బసవ మండపంలో నిర్వహించనున్నారు.

ఒకే ఏడాదిలో తండ్రీకొడుకులు పది పాస్

కొండపాక, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): చదువుకు వయసుతో సంబంధం లేదు. చదవాలని తపన ఉంటే దానిని సాధించవచ్చు. అందుకు ఉదాహరణ కొండపాక మండలం గిరాయిపల్లి గ్రామానికి చెందిన ముక్కెర 38 ఏళ్ల బాలనర్సు. ఆయన ఓపెన్ వర్సిటీలో పది పరీక్ష రాసి 248 మార్కులతో ఉత్తీర్ణత సాధించాడు. ఆయన కుమారుడు ప్రదీప్ ఇటీవల విడుదలైన పదోతరగతి ఫలితాల్లో 444 మార్కులతో ఉత్తీర్ణత సాధించాడు. ఇలా తండ్రీకొడుకు ఒకే సంవత్సరంలో పదోతరగతి పాసవ్వడంతో పలువురు అభినందించారు.

ఖాళీ సీట్ల భర్తీకి స్పాట్ కౌన్సెలింగ్

జిన్నారం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): జిన్నారం ఎస్టీ గురుకుల కళాశాలలో మిగిలి ఉన్న ఖాళీ సీట్లకు ఈ నెల 13న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ వెంకటనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ కోర్సులలో మిగిలి ఉన్న ఖాళీ సీట్ల భర్తీ కోసం స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని, కేవలం ఎస్టీ విద్యార్థులు మాత్రమే అర్హులని, ఆసక్తి గల వారు సంబంధిత సర్టిఫికేట్లతో హాజరు కావాలని పేర్కొన్నారు.

శిక్షణ ముగిసే... ఆచరణే తరువాయి

- 12 నుంచి బడులు పున:ప్రారంభం
- అభ్యసన సామర్థ్యాల పెంపునకు టీచర్ల సన్నద్ధం

సంగారెడ్డి అర్బన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి) : పాఠశాల స్థాయిలో విద్యార్థులకు అభ్యసన సామర్థ్యాలు పెంపొందించి ఆసక్తికరంగా బోధన అందించేందుకు గత నెల ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మే 13 నుంచి 31 వ తేదీ వరకు మూడు విడతల్లో నిర్వహించిన శిక్షణలో 3630 మంది ఉపాధ్యాయులు శిక్షణలో తర్ఫీదు పొందారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా విద్యాశాఖ ఉపాధ్యాయులను సన్నద్ధం చేసింది. అయితే మరో ఐదు రోజుల్లో వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో శిక్షణలో నేర్చుకున్న అంశాలను, బోధన పద్ధతులను ఉపాధ్యాయులు తరగతి గదుల్లో అమలు చేయాల్సి ఉంటుంది.


సంగారెడ్డిలో టీచర్లకు శిక్షణ ఇస్తున్న రిసోర్స్ పర్సన్స్ (ఫైల్)

ఆచరణే మిగిలింది

బోధనలో నాణ్యతను పెంచడంతో పాటు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెంపునకు శిక్షణ దోహద పడిందని ఉపాధ్యాయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ క్రమంలో ఉపాధ్యాయుల సన్నద్ధత, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ తయారుచేసుకోవడం, ఇంటరాక్టివ్ ప్యానెల్స్ ద్వారా ఎలా బోధించాలి వంటి వాటిపై అవగాహన కల్పించారు. తరగతి గదిలో విద్యార్థులను ఆకర్షించేలా వారు ఇష్టంగా వినేలా ఆయా సబ్జెక్టుల్లో బోధన చేయాల్సి ఉంటుంది. పాఠ్యాంశాల అంశమే కాకుండా యువత ఎదుర్కొంటున్న సమస్యలు మహిళల అక్రమ రవాణా, పోక్సో చట్టంపై అవగాహన, సైబర్ సెక్యూరిటీ తదితర వాటిపై శిక్షణ పొందారు. ఏదేమైనప్పటికీ ఉపాధ్యాయులకు ఇచ్చిన వృత్తంతర శిక్షణలో తర్ఫీదు పొందిన అంశాలను సర్కారు బడి పిల్లలకు క్షేత్ర స్థాయిలో ఆచరణ అమలు ఏ మేరకు సత్ఫలితాలిస్తుందో వేచి చూడాల్సిందే.

బాలుడి ఆలోచన అదుర్స్

- పాత సామగ్రితో సైకిల్‌ను మోపెడ్‌గా తయారీ
- తక్కువ ఖర్చుతో శ్రమ లేకుండానే ప్రయాణం

నారాయణఖేడ్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మోపెడ్‌పై ప్రయాణం చేయాలనే కోరికే ఆ బాలుడితో తన సైకిల్‌నే మోపెడ్‌గా తయారు చేసుకునేలా చేసింది. 9వ తరగతి చదువుతున్న బాలుడు తన తాత ఇప్పించిన సైకిల్‌నే పాత స్ప్రేయర్ పంపు మోటర్‌తో మోపెడ్‌ను చేసుకున్నాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. నారాయణఖేడ్ మండలం జి.హుక్రానకు చెందిన వడ్ల నర్సింహులు, మంజుల దంపతులు కొన్నేళ్లుగా నారాయణఖేడ్‌లో నివసిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు శివకుమార్ చారి, శ్రీకాంత్ సంతానం. నర్సింహులు నారాయణఖేడ్‌లో వెల్డింగ్ షాప్ నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. పెద్ద కుమారుడు శివకుమార్ చారి స్థానిక ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. అందరిలాగే తాను కూడా మోపేడ్ నడపాలనే ఆశ ఉన్నప్పటికీ, దాని కొనుగోలుకు రూ.60 వేల వరకు అవసరం కావడంతో తానే స్వయంగా సైకిల్‌నే మోపెడ్‌గా మార్చి శభాష్ అనిపించుకుంటున్నాడు. క్రిమి సంహారక మందులను పిచికారీ చేసే స్ప్రేయర్ మోటర్‌ను బాబాయ్ రమేష్ సహాయంతో తక్కువ ధరకు కొనుగోలు చేశాడు. దాన్ని సైకిల్ క్యారిల్‌పై అమర్చి, టీవీఎస్ ఎక్సల్‌కు సంబంధించిన చైన్, చక్రం, కొనుగోలు చేసి మధ్యలో బిగించడమే కాకుండా ఎక్స్‌లేటర్ వైర్‌ను సైకిల్ హ్యాండిల్‌కు బిగించాడు. మోటర్ తీగ సహాయంతో ఆన్ చేసిన అనంతరం సీటుపై కూర్చొని ఎక్స్‌లేటర్ ఇవ్వగానే, సైకిల్ పైడిల్ తొక్కకుండానే ముందుకు సాగుతుంది. నాలుగు రోజుల క్రితమే శివకుమార్ దీన్ని తయారు చేశాడు. స్ప్రేయర్ పంపు పాతది కావడంతో లీటర్ పెట్రోల్‌కు 40 కిలో మీటర్ల మైలేజ్ ఇస్తుందని బాలుడు తెలిపాడు. కేవలం రూ.5 వేలతోనే దీన్ని తయారు చేసినట్లు చెప్పాడు.


తాను తయారు చేసుకున్న మోపెడ్ సైకిల్‌పై శివకుమార్‌చారి

క్రైం కార్నర్

నీట మునిగి యువకుడి మృతి


బాల్ రాజు (ఫైల్ ఫోటో)

పాపన్నపేట, జూన్ 7(ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తూ నీట మునిగి యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని పొడ్చన్‌పల్లిలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చిన్నమోల బాల్ రాజు(29) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. చేపలు పట్టేందుకు శనివారం గ్రామంలో ఉన్న గడం చెరువు వద్దకు వెళ్లి చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తూ నీట మునిగాడు. స్థానికులు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న వారు స్థానికుల సాయంతో మృతదేహాన్ని వెలికి తీశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. తండ్రి మోగులయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చేపల వేటకు వెళ్లిన మత్స్యకార్మికుడు..

నర్సాపూర్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): చేపల వేటకు వెళ్లి మత్స్య కార్మికుడు మృతిచెందాడు. కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్ పట్టణానికి చెందిన మత్స్యకార్మికుడు యాదగిరి(45) శనివారం సాయంత్రం స్థానిక రాయరావు చెరువులో చేపల కోసం వెళ్లాడు. చెరువులో చేపలు పడుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు వల తట్టుకుని బయటకు రాలేక నీట మునిగి మతిచెందాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో తండ్రిని కొట్టి చంపిన తనయుడు


మొగులయ్య (ఫైల్)

కోహీర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో కొడుకు తన తండ్రిని విచక్షణరహితంగా కొట్టి చంపిన సంఘటన సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. గ్రామస్థులు, పోలీసుల కథనం ప్రకారం నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బుచన్‌పల్లి మొగులయ్య (46)కు భార్య, ఇద్దరు కొడుకులు, ఓ కూతురు ఉంది. మొగులయ్య కష్టపడి ముగ్గురు పిల్లలను చదివించాడు. తనకున్న పొలంలో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కూతురు వివాహాన్ని వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట మండలానికి చెందిన వ్యక్తితో జరిపించేందుకు మొగులయ్య, భార్య అమృతం నిశ్చయించారు. గత ఏప్రిల్ 16న తేదీన పెళ్లి చేసేందుకు పత్రికలు కూడా పంచేశారు. అయితే, మొగులయ్య కూతురు నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన యువకుడిని ప్రేమించి, పెళ్లికి ముందురోజు ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. కూతురును ప్రేమించిన యువకుడు తన పెద్ద కుమారుడైన మహేష్ స్నేహితులు కావడంతో తనకు ముందే ఈ విషయం చెప్పకుండా పరువు తీశారని కొడుకుతో గొడవపడుతుండేవాడు. శుక్రవారం రాత్రి కూడా తండ్రీ కొడుకుల మధ్య గొడవ జరిగింది. మద్యం మత్తులో ఉన్న మహేష్ మొగులయ్యను ఇనుపరాడ్‌తో విచక్షరహితంగా కొట్టాడు. దీంతో, తీవ్రంగా గాయపడిన మొగులయ్యను కుటుంబ సభ్యులు కోహీర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం జహీరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడికి చేరుకునేసరికే మొగులయ్య మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కోహీర్ ఎస్‌ఐ గోపతి సతీష్ తెలిపారు.

అనారోగ్యంతో పీపుల్స్ వార్ మాజీ దళనాయకుడి మృతి


పోచయ్య (ఫైల్)

కొండపాక, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కొండపాక మండలం నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పీపుల్స్ వార్ గిరాయిపల్లి మాజీ దళనాయకుడు కోటగళ్ల పోచయ్య ఎలియాస్ రాజన్న అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందాడు. కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పోచయ్య ఆనాటి పీపుల్స్ వార్ గ్రూప్‌లో గిరాయిపల్లి దళంలో సభ్యుడిగా చేరాడు. తర్వాత దళ నాయకుడిగా బాధ్యతలు చేపట్టి మూడు సంవత్సరాలపాటు కొనసాగాడు. హైదరాబాద్‌లో కొరియర్ మన్‌గా పనిచేశాడు. కొంతకాలంలో తర్వాత పోలీసులకు లొంగిపోయి గ్రామంలో ఉంటూ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల అనారోగ్యానికి గురై శుక్రవారం రాత్రి మృతి చెందాడు.

అంధకారంలో రేగోడు రైతు వేదిక

రేగోడు జూన్ 7(ఆంధ్రజ్యోతి): రైతులు, అధికారులు సభలు, సమవేశాలు, నూతన పంటల సాగుపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన రైతు వేదికలు నిర్వహణ సరిగా లేకపోవడంతో అసౌకర్యంగా మారాయి. రేగోడు రైతు వేదిక రెండేళ్లుగా విద్యుత్, తాగునీటి సౌకర్యానికి నోచుకోవడం లేదంటే పరిస్థితి ఎంత దారుణంతో ఉందో తెలుసుకోవచ్చు. విద్యుత్ బిగించిన ఎర్తింగ్ సమస్యతో విద్యుత్ సరపరా జరగడంలేదు. ఇటీవల భూభారతి చట్టంపై కలెక్టర్ రాహుల్ రాజ్ సదస్సు ఏర్పాటు చేయగా ఒక రోజు కోసం విద్యుత్ సరఫరా చేసి వదిలేశారు. దీంతో ఫ్యాన్లు, విద్యుత్ బల్బులు, వీడియో పరికాలు అలంకార ప్రాయంగా మారాయి. నీటి సౌకర్యం ఏర్పాటు చేయకపోవడంతో తాగునీరు సౌకర్యం లేకుండా పోయింది. మరుగు దొడ్లు నిర్మించిన నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.


వ్యవసాయ యంత్రాల స్టాల్‌లో రైతుల సందడి



వ్యవసాయ పనిముట్ల స్టాల్ వద్ద సిరిసిల్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు, సెల్ఫీ దిగుతున్న రైతు

సందడిగా..

హుస్నాబాద్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్న కిసాన్ మేళా శనివారం కూడా రైతులతో సందడిగా సాగింది. ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, రైతులు యార్డులో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు పలు పంటలపై ప్రత్యేక అవగామన కార్యక్రమాలు నిర్వహించారు. ఫిష్ పాండ్‌లను చిన్నారులు ఎంతో ఆసక్తి తిలకించారు. అధునాతన వ్యవసాయ యంత్రాలపై రైతులు ఆరా తీశారు. అనంతరం సెల్ఫీలు దిగుతూ సంతోషం వ్యక్తం చేశారు.


గడ్డి కటింగ్ చేసే యంత్రం వద్ద రైతులు


ఫిష్ పాండ్ వద్ద చిన్నారులు

న్యూస్ బాక్స్

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చిలప్‌చెడ్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి నిరుపేదలకు ఒక వరం లాంటిదని కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు చిలప్‌చెడ్ మండల ప్రధానకార్యదర్శి కొత్తకాపు శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన మండలంలో పలువురు లబ్ధిదారుల కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.3,40,000 విలువ చేసే చెక్కులను 9 మంది లబ్ధిదారులకు అందజేసినట్లు తెలిపారు.

● **శివ్వంపేట:** ఆరోగ్య సమస్యకు సీఎం సహాయనిధి ఎంతగానో ఉపయోగముందని టీపీసీసీ కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన 18 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.7,21,000 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం కాంగ్రెస్ నాయకుడు నవీన్ గుప్తా గృహంలో రాజిరెడ్డి అందజేశారు.

● **నారాయణఖేడ్:** సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి శనివారం నారాయణఖేడ్‌లో లబ్ధిదారులకు అందజేశారు. అనంత్‌సాగర్‌కు చెందిన చాకలి విఠల్‌కు మెరుగైన వైద్యం కోసం రూ.54 వేలు, తస్లింబేగంకు రూ.13,500 విలువైన చెక్కులను అందజేశారు.

కార్యకర్తకు అండగా..

జిన్నారం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న పార్టీ కార్యకర్తను శనివారం ఎమ్మెల్సీ అంజిరెడ్డి పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. జిన్నారం మండలం దాదిగూడెం గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త వెంకటేశ్ ఇటీవల అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందాడు. శనివారం వెంకటేశ్‌ను పరామర్శించిన ఎమ్మెల్సీ రూ.20వేల ఆర్థిక సహాయం అందజేశారు.

అధ్వానంగా అల్గోల్ చౌరస్తా

- బైపాస్‌రోడ్డు వద్ద పాడై శిథిలమైన రోడ్డు
- 2022లో రూ.86 లక్షలు మంజూరు
- పూర్తయిన బ్రిడ్జి పనులు
- కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఆగిన రోడ్డు పనులు



అల్గోల్ చౌరస్తా వద్ద బురదమయంగా మారిన రోడ్డు

జహీరాబాద్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ పట్టణంలో రోడ్లు అధ్వానంగా మారాయి. పట్టణంలోని అల్గోల్ చౌరస్తా వద్ద భరత్‌నగర్ వైపు వెళ్లే రోడ్డు గుంతలమయంగా తయారైంది. ఈ రోడ్డును బాగుచేయాలంటూ పలుమార్లు ప్రయాణికులు, స్థానికులు, ప్రజాప్రతినిధులతో పాటు అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడంతో తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా చిరుజల్లులు కురిస్తేచాలు వర్షపునీరు రోడ్డుపై ఏర్పడిన లోతైన గుంతల్లో చేరి కనీసం నడిచి వెళ్లేందుకు కూడా తీవ్ర ఇబ్బందులు తప్పని దుస్థితి నెలకొన్నది.

నిధులు మంజూరై మూడేళ్లు గడిచినా..

2022లో రూ.86 లక్షల వ్యయంతో బ్రిడ్జితో పాటు 200 మీటర్ల మేర రోడ్డు మంజూరైంది. ప్రస్తుతం బ్రిడ్జి పనులు పూర్తయినప్పటికీ రోడ్డుపనులను చేపట్టాల్సి ఉంది. మీటరున్నర ఎత్తుతో రోడ్డు పనులు పూర్తిచేయాల్సి ఉన్నది. బిల్లులు రాని కారణంగా కాంట్రాక్టర్ పనులను పూర్తిచేయడానికి ఉత్సాహం చూపడం లేదని ఆర్అండ్‌బీ అధికారులు పేర్కొంటున్నారు. ఏమైనప్పటికీ రోడ్డుపూర్తిగా దెబ్బతినడంతో ఆరోడ్డు గుండా వెళ్ళే వాహనదారులకు తిప్పలు తప్పడలేదు. కాంట్రాక్టర్ పనులను త్వరిగతిన పూర్తిచేయకపోతే త్వరలో పనులను రద్దుచేసి ఇతర కాంట్రాక్టర్‌కు అప్పగిస్తామని ఆర్అండ్‌బీఅధికారులు స్పష్టం చేశారు. ప్రజలు, వాహనదారుల ఇబ్బందుల దృష్ట్యా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డుపనులను త్వరగా పూర్తయ్యేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు .

గ్రామాల్లో ముమ్మరంగా బడిబాట





నారాయణఖేడ్, వెల్దుర్తిలో బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

నారాయణఖేడ్/చిన్నశంకరంపేట/వెల్దుర్తి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోని పలు మండలాల్లో శనివారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఖేడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలోని నెహ్రూనగర్, శాస్త్రీనగర్, రాంమందిర్ గల్లీ, సువర్ణ షెట్కార్ టాకీస్ రోడ్డు పక్కన గల కాలనీల్లో హెచ్‌ఎం యాదగిరి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. ప్రభుత్వం పాఠశాలల్లో కల్పిస్తున్న సదుపాయాలను గురించి వివరించి, పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని కోరారు. చిన్న శంకరంపేట మండల కేంద్రంతోపాటు మిర్జాపల్లి, సూరారం, జంగరాయి, తదితర గ్రామాల్లో ఉపాధ్యాయులు ఇంటింటికి వెళ్లి పిల్లల తల్లిదండ్రులకు కల్పించారు. ఉపాధ్యాయులతో కలిసి బడిబాట ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో పుష్ప వేణి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. బడీ ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని వెల్దుర్తి పీఎంశ్రీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సాంబయ్య అన్నారు. వెల్దుర్తితో పాటు ఆయా గ్రామాల్లో బడి బయట ఉన్న పిల్లలను గుర్తించడానికి ఉపాధ్యాయులు ఇంటింటా సర్వే నిర్వహించారు. అంతకముందు గ్రామాల్లో బడిబాట ర్యాలీ నిర్వహించారు.

సాగుకు సన్నద్ధం

(5వ పేజీ తరువాయి)

పెసర 593 క్వింటాళ్లు, కందులు 3,393 క్వింటాళ్లు, జొన్నలు 33 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయి. అలాగే, ఎరువులు యూరియా 41,900 మెట్రిక్ టన్నులు, డీఏపీ 14,045 మెట్రిక్ టన్నులు,ఎంవోపీ 19,682 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పీ 9,225 మెట్రిక్ టన్నులు ఎరువులను అందుబాటులో ఉంచినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు.

నేల తడిసిన తరువాతే విత్తనం వేసుకోవాలి

తొలకరి వర్షాలకే తొందరపడి విత్తనాలు వేసుకోవద్దు. 60 శాతానికి పైగా నేల తడిస్తేనే విత్తుకోవాలి. ఈ వానాకాలం సీజన్‌లో అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయి. నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలి. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసేటప్పుడు తప్పకుండా రశీదు తీసుకొని భద్రపర్చుకోవాలి. జీలుగ, జనుము విత్తనాలు రాయితీపై పంపిణీ చేస్తున్నాం.

- శివప్రసాద్, సంగారెడ్డి జిల్లా వ్యవసాయశాఖ అధికారి

ప్రతిష్ఠాపనోత్సవాలతో ఆధ్యాత్మిక సందడి



రామచంద్రాపురం టౌన్: కాకతీయనగర్ కాలనీలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో మాధవానందసరస్వతి



శివ్వంపేట: పిల్లుట్ల గ్రామంలో రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో మైనంపల్లి హనుమంతరావు

రామచంద్రాపురం టౌన్ జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం డివిజన్ పరిధి కాకతీయనగర్ కాలనీలో శనివారం శివపంచ నాగవిగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరిపారు. మాధవానంద సరస్వతి స్వామి ప్రతిష్ఠాపన ఉత్సవంలో పాల్గొని పూజలు చేశారు.

నారాయణఖేడ్: నారాయణఖేడ్ శివార్లలోని మనూరు క్రాస్ రోడ్స్ వద్ద లలితాంబిక దేవి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు శనివారం రెండవ రోజున భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు దేవి ఉపాసకులు శ్రీపంతులు, పురోహితులు గురుజ్యోషి పాల్గొన్నారు.

శివ్వంపేట: శివ్వంపేట మండల పరిధిలోని పిల్లుట్ల గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిలిచిన రేణుకాఎల్లమ్మ ఆలయంలో మూడు రోజులపాటు నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు శనివారం ఘనంగా ముగిశాయి. కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మైనంపల్లి హనుమంతరావు, టీపీసీసీ కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినీరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్‌దాస్ మల్లేష్‌గౌడ్ హాజరై అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. బోనాల ఊరేగింపు శివసతుల పూనకాలు డప్పు చప్పులతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొన్నది.

తూప్రాన్: తూప్రాన్ మండలం గుండ్రెడ్డిపల్లిలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లి విగ్రహాప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా జరిగింది. శనివారం మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుతో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● చిన్నశంకరంపేట: చిన్నశంకరంపేట మండలంలోని టి మాందాపూర్ గ్రామ సంఘం ముదిరాజ్ ఆధ్వర్యంలో పెద్దిరాజు పెద్దమ్మ ఆలయ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఆలయం వద్ద బోనాల బండ్లను డప్పు సన్నాయిల మధ్య ఊరేగించారు. పోతురాజుల విన్యాసాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

ఖమ్మంపల్లి వాసికి అస్ట్రేలియాలో మాస్టర్ డిగ్రీ



సాయికళ్యాణ్‌కు సర్టిఫికెట్‌ను అందజేస్తున్న యూనివర్సిటీ ఛాన్సలర్

మునిపల్లి, జూన్7 (ఆంధ్రజ్యోతి): అస్ట్రేలియాలోని సిడ్నీలో వెస్టర్న్ యూనివర్సిటీలో మునిపల్లి మండలం ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన పైతర సాయి కళ్యాణ్ మాస్టర్ డిగ్రీ సర్టిఫికెట్‌ను యూనివర్సిటీ ఛాన్సలర్ చేతులమీదుగా అందుకున్నారు. అస్ట్రేలియాలో తమ కుమారుడు ఉన్నత చదువులు చదివి పట్టా పొందడం సంతోషంగా ఉందని తల్లిదండ్రులు మునిపల్లి మాజీ జడ్పీటీసీ పైతర మీనాక్షి సాయికుమార్ తెలిపారు. శనివారం సాయికళ్యాణ్‌ను సన్మానించి మరిన్ని ఉన్నత చదువులు అధిరోహించాలని పలువురు ఆకాంక్షించారు. సన్మానించిన వారిలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, పీఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పైతర సాయికుమార్, మాజీ జడ్పీటీసీ పైతర మీనాక్షి, మనీష్ రెడ్డి, మనోజ్ తదితరులు ఉన్నారు.

తడి,పొడి చెత్తపై ఇంటింటి అవగాహన

నారాయణఖేడ్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో శనివారం మున్సిపల్ సిబ్బంది తడి,పొడి చెత్తపై పట్టణ ప్రజలకు ఇంటింటి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా తడి, పొడి చెత్త సేకరణ కోసం మున్సిపాలిటీ ద్వారా చెత్త సేకరణ వాహనాలను ఇంటింటికి పంపుతున్నామని మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ తెలిపారు. కార్యక్రమంలో శానిటేషన్ అధికారి శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

స్టేడియానికి స్థలం కేటాయింపుకు చర్యలు



స్టేడియం స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ దేవదాస్

ఐడీఏబొల్లారం జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఐడీఏబొల్లారం పురపాలక పట్టణంలో అధునాతన సౌకర్యాలతో స్టేడియం నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ మధుసూదన్‌రెడ్డి చెప్పారు. ఈ మేరకు శనివారం తహసీల్దార్ దేవదాస్‌తో కలిసి స్థలపరిశీలన చేశారు. స్థలానికి చుట్టుపక్కల అన్ని రకాల ఆక్రమణలు తొలగించేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. నాలుగు ఎకరాల స్థలాన్ని కేటాయించేటట్టు కొలతలకు సర్వేయర్‌ను పంపిస్తామని తెలిపారు.

చెరువు పూడికతీత పనులు ప్రారంభం

చేగుంట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): చేగుంట మండల పరిధిలోని మక్కరాజిపేట గ్రామంలోని బూరుగు చెరువులో సేహగల్ ఫౌండేషన్, కోకోకోలా సంస్థ సహకారంతో చెరువు పూడిక తీత పనులు మాజీ సర్పంచ్ కుమ్మరి శ్రీనివాస్, సంస్థ ప్రతినిధులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ కుమ్మరి శ్రీనివాస్ మాట్లాడుతూ చెరువులో సారవంతమైన మట్టిని రైతుల పొలాలకు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సంస్థ మల్లికార్జున్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌తో పాటు నాయకులు విశ్వేశ్వర్, జింక శ్రీనివాస్, సంస్థ ప్రతినిధులు మల్లికార్జున్ , గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

10న ఎస్టీ గురుకుల కళాశాలలో కౌన్సెలింగ్

నారాయణఖేడ్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఖేడ్ గిరిజన బాలుర సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో మిగిలిపోయిన సీట్లలో ప్రవేశాలకు గాను 2024-2025 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులైన బాలురకు ఈ నెల 10న ఉదయం 10గంటలకు గురుకుల కళాశాలలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ యాదగిరి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కౌన్సెలింగ్‌కు హాజరయ్యే అభ్యర్థులు సంబంధిత ఒరిజినల్ ధ్రువపత్రాలు, జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని తెలిపారు.



మెదక్‌లోని నవాబ్ పేట ఈద్గాలో ప్రార్థనల్లో ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు



చేగుంట మండలం పోతనపల్లిలో ఈద్గాల వద్ద ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు



శివ్వంపేట ఈద్గాలో ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

భక్తిశ్రద్ధలతో బక్రీద్ ప్రార్థనలు

త్యాగానికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్ పండుగను సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో శనివారం ముస్లిం లు ఘనంగా జరుపుకున్నారు. ముస్లింలు చిన్న పెద్ద తేడా లేకుండా నూతన వస్త్రాలు ధరించి ఉదయమే కుటుంబసభ్యులతో కలిసి సమీపంలో గల ఈద్గాలకు చేరుకుని భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఇమామ్‌లు పండుగ ప్రాముఖ్యాన్ని వివరించారు. అనంతరం బంధుమితులకు ఆత్మీయ ఆలింగనాలతో పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈద్గాలవద్దకు ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల నాయకులు చేరుకుని ముస్లిం సోదరులకు బక్రీద్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా జిల్లాల పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

- న్యూస్‌నెట్‌వర్క్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి)



జహీరాబాద్‌లో బక్రీద్ ప్రార్థనల్లో మాజీ మంత్రి చంద్రశేఖర్ తదితరులు



కంగ్టి: తడ్కల్‌లో ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లిం

సంగారెడ్డిలో ముగిసిన క్రికెట్ శిక్షణ శిబిరం



సంగారెడ్డి ఎంఎస్ అకాడమీలో సర్టిఫికెట్లతో శిక్షణ పొందిన క్రీడాకారులు

సంగారెడ్డి అర్బన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని ఎం.ఎస్. అకాడమీలో గత నెల రోజులుగా ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ నిర్వహించిన ఉచిత వేసవి శిక్షణ శిబిరం ముగిసింది. సంగారెడ్డి పరిసర ప్రాంతాల నుంచి సుమారు 100 మంది శిక్షణ పొందారు. వీరికి చివరి రోజున పార్టిసిపేషన్ సర్టిఫికేట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి రాజేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మధుమోహన్‌రెడ్డి, కోచ్‌లు శ్రీనాథ్‌రెడ్డి, కలీం, ఇనాం, సాయికుమార్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

అందరూ ప్రభుత్వ బడుల్లోనే చదవాలి

● రామాయంపేట చేరిన ప్రచార జాతా



రామాయంపేటలో మాట్లాడుతున్న నర్సిరెడ్డి

రామాయంపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): అందరూ ప్రభుత్వ బడుల్లోనే చదవాలన్న లక్ష్యంతో రాష్ట్ర పౌర స్పందన వేదిక చేపట్టిన ప్రచార జాతా శనివారం సాయంత్రం రామాయంపేటకు చేరుకున్నది. స్థానిక బస్టాండ్ ఎదుట ఆగిన ప్రచార కార్యక్రమంలో ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు నర్సిరెడ్డి మాట్లాడారు. ప్రస్తుతం లక్షలు ఖర్చు చేసి పేద కుటుంబాలు సైతం ప్రైవేటు కళాశాలలో చేరి నష్టపోతున్నారన్నారు. అందువల్ల అందరూ ప్రభుత్వ స్కూళ్లు, కాలేజీలను ఎంచుకునేలా పాలకులు చర్యలు చేపట్టాలన్నారు.

ఇక్రిశాట్ ఫెన్సింగ్ ఏరియాలో విద్యుత్తు స్తంభాలు

రామచంద్రాపురం టౌన్ జూన్ 7 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌తీగలు వేలాడుతున్న ప్రాంతాల్లో నూతన స్తంభాలు వేసేటట్టు చర్యలు తీసుకుంటామని జోనల్ కమిషనర్ హేమంత్ చెప్పారు. ఈ మేరకు శనివారం భారతీనగర్ డివిజన్ పరిధి మ్యాక్‌సొసైటీ ఎల్ఐజీ, బీడీఎల్, ఇక్రిశాట్ ప్రాంతాల్లో పర్యటించారు. స్థానికంగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఖైల్ ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు పారబోయకుండా చైన్‌లింకు మెస్ ఏర్పాటు చేయడానికి నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ కోరారు. సీసీరోడ్లు వేయడానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. బీడీఎల్, ఎంఐజీ కాలనీల్లో పాడైన ఓపెన్‌జిమ్ పరికరాలను మరమ్మతు చేయించాలని కోరారు. కార్యక్రమంలో ఉపకమిషనర్ సురేష్, దేవేందర్, ఏఈ ఫైజల్, విజయరాంరావు తదితరులు ఉన్నారు.

'వన్ నేషన్- వన్ ఎలక్షన్' పై అవగాహన

చిలప్‌చెడ్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో పార్టీలకు అతీతంగా 'వన్ నేషన్- వన్ ఎలక్షన్ అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు మెదక్ జిల్లా వన్ నేషన్ వన్ ఎలక్షన్ కో కన్వీనర్ వెల్మకన్న రాజేందర్ పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని మండలాల నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి అందరూ సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో.. చిలప్‌చెడ్ మండల బీజేపీ అధ్యక్షుడు అజ్జమర్రి నగేష్, మండల కన్వీనర్ శ్రీకాంత్ గౌడ్, కో కన్వీనర్ రామకృష్ణ, వివిధ గ్రామాల బూత్ అధ్యక్షులు, నాయకులు, వివిధ కుల సంఘాల పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

గోమారంలో వికసిత కృషి సంకల్ప అభియాన్



శివ్వంపేట: గోమారంలో అభియాన్ ర్యాలీలో పాల్గొన్న రైతులు

శివ్వంపేట/హవేళిఘణపూర్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): శివ్వంపేట మండల పరిధిలోని గోమారం గ్రామంలో శనివారం వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని కృషి విజ్ఞాన కేంద్రం, తునికి శాస్త్రవేత్త శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రైతులకు సేంద్రియ వ్యవసాయ పద్ధతుల పైన అవగాహన కార్యక్రమం నిర్వంచారు. ఎన్‌బీపీజీఆర్ ప్రధాన శాస్త్రవేత్త శరవణన్, డాక్టర్ పాపారావు జాతీయ పరిశోధన సంస్థ, హైదరాబాద్, వ్యవసాయ అధికారి లావణ్య, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, మాజీ ఎంపీటీసీ నరసింహారెడ్డి, చైర్మన్ శ్రీనివాస రెడ్డి, సీఈవో రాజేందర్, రైతులు తదితరులు పాల్గొన్నారు. హవేళిఘణపూర్ మండలంలోని తొగిట, మధుల్వాయి గ్రామాల్లో వికసిత కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీకాంత్ పంటల సాగుపై రైతులకు ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు జేసుదాను, ఏవో బాల్ రెడ్డి, ఏఈవోలు ప్రశాంత్, భార్గవ్ గౌడ్, రైతులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన బీజేపీ నాయకులు

మనోహరాబాద్ జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మనోహరాబాద్ మండల కేంద్రంలో కాళ్లకల్ గ్రామంలో బీజేపీ నాయకులు మొక్కలు నాటారు. దేశ ప్రధాని మోదీ 11 సంవత్సరాల పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా మండలంలోని కాళ్లకల్ గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు మొక్కలను నాటారు. ఇందులో బీజేపీ రాష్ట్ర నాయకుడు పురం మహేష్, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, మల్లేష్, నర్సింలు, నరేందర్‌గౌడ్, ప్రణయ్, క్రిష్ణ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ మండల కార్యకర్తల సమావేశం

చేగుంట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతీ కార్యకర్తపై ఉందని బీజేపీ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు చేగుంట మండల ప్రభారి సుభాష్‌రెడ్డి అన్నారు. చేగుంట మండల శాఖ అధ్యక్షుడు ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌస్‌లో శనివారం మండల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ భారత ప్రధానమంత్రిగా 11 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా దేశంలో రూపొందించిన పథకాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు ఎల్లారెడ్డితో పాటు మాజీ అధ్యక్షులు చింతల భూపాల్, మాజీ ఎంపీపీ కర్ణ పాండు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీద సుజాత, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రేపు బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు అవగాహన

సంగారెడ్డి రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్ వినియోగదారుల అవగాహన సదస్సు ఈ నెల 9వ తేదీన నిర్వహించనున్నట్టు ప్రోగ్రామ్ జనరల్ మేనేజర్ డి. రాజరాజేశ్వరి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని కోర్టు ఎదురుగా ఉన్న ఎఫ్ఆర్ఎస్ రోడ్డులో గల బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు తెలిపారు.

తూప్రాన్‌లో యువకుడు అదృశ్యం



అదృశ్యమైన సురేష్

తూప్రాన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): కంపెనీలో విధులకు వెళ్లిన యువకుడు అదృశ్యమయ్యాడు. శనివారం ఎస్ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. తూప్రాన్ పట్టణానికి చెందిన కాళ్లకంటి సురేష్ (28) మనోహరాబాద్ మండలం రామాయపల్లి శివారులోని కాకతీయ పైపుల కంపెనీలో విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 6న ఉదయం కంపెనీలో విధులకు సురేష్ హాజరై, రాత్రికి ఇంటికి చేరుకోలేదు. సురేష్ కోసం వెతికినా ఆచూకీ లభించలేదు. శనివారం సురేష్ భార్య శ్వేత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్ఐ వివరించారు.